# ఆమె ప్రేమ

— మారగాని రాంబాబు

లేలేత గులాబి రంగు కాంతి పరచుకున్న విశాలమైన బెడ్‌రూంలో ఆలోచిస్తోంది వినీల. పెద్దలు కుదిర్చేసే పెళ్ళిళ్ళ మీద సదభిప్రాయం లేదామెకు.

"శాంతా! మన మోహన్‌రావు అమ్మాయికో మంచి సంబంధం వుంది చూద్దామా! అనడిగాడు. నీవేమంటావు?" అన్నాడు రాజారావు.

"నేననేదేముంది. మంచి సంబంధం అయితే అలాగే చూద్దాం" అంది శాంత.

భోజనాల దగ్గర తల్లిదండ్రుల సంభాషణ విన్నప్పటి నుండి ఆలోచనగా వుంది వినీలకు.

నో... పెద్దలు కుదిర్చే పెళ్ళి చేసుకోకూడదు. క్షణాల చూపులతో మనసులు కలుస్తాయా? ఎక్కడో పుట్టి పెరిగి అభిరుచులు, అభిప్రాయాలు పూర్తిగా తెలుసుకోకుండా తాళి పేరుతో ఒక్కటైపోవడం ఆశ్చర్యంగా వుంది.

ముక్కు ముఖం తెలియని ఓ అపరిచిత వ్యక్తిని జీవితంలోకి ఆహ్వానించడం ఇష్టం లేదు తనకి.

ఒకవేళ అభిమానవంతుడే అయినా జీవితాంతం ఆప్యాయతల్ని పంచగలడా?– అనుకుంటున్న ఆమెకు హఠాత్తుగా స్నేహితురాలు మాళవిక గుర్తుకు వచ్చింది.

అవును అది సుఖపడుతోందా! ఐశ్వర్యవంతుడు, డాక్టరు అని కట్టబెట్టారు. ఇంటి ధ్యాసే లేదతనికి. మనసు చంపుకుని బ్రతుకుతోంది పాపం. అలాగే పక్కింటి ఆంటీ, ఇంతెందుకు అమ్మానాన్నే వున్నారు – నాన్నకెపుడూ బిజినెస్, అమ్మకైతే మహిళా మండలి, సభలు సమావేశాలు – ఏనాడైనా మనసు విప్పి మాట్లాడుకున్నారా? లేదే! అందుకే వాళ్ళు కుదిర్చే పెళ్ళి చేసుకోకూడదు.

కొంతకాలం ఎవర్నైనా ప్రేమించి తర్వాత పెళ్ళి చేసుకుంటే – అమె అలా అనుకోగానే గుర్తుకువచ్చాడు అతను. అతడ్ని తలచుకోగానే ఆనాటి సంఘటన గుర్తుకొచ్చింది.

ఒక వ్యక్తి లేని శక్తి కూడదీసుకుని పరిగెడుతున్నాడు. వెనుక నలుగురు – తళతళ మెరుస్తూ పదునైనా కొడవళ్ళు, బాకులతో వెంబడిస్తున్నారు అతన్ని. రోడ్డు మధ్యలో వున్న సిమెంటు దిన్నె తట్టుకుని పడ్డాడా వ్యక్తి. అతని చుట్టూ మూగారు.

వెళ్తున్న జనం చెల్లాచెదురైపోయారు. ముఠా తగాదాలకు ఆత్రంగా బలైపోతున్నాడు. ఆ నలుగురు వ్యక్తులు తమ ఆయుధాలకు పని కల్పించి వెళ్ళిపోయారు ఆదుర్దాగా.

క్షణంలో అక్కడి దుకాణాలు ఒక్కసారిగా మూతపడ్డాయి. ఆ వ్యక్తి రక్తపుమడుగులో గిలగిలా కొట్టుకుంటున్నాడు. బస్ షెల్టర్ వద్ద బస్సు కోసం వేచి వున్నవారందరూ పక్కకి జారుకున్నారు.

అప్పుడే అక్కడికి వచ్చిన మహంత్ రక్తపుమడుగులో వున్న వ్యక్తిని చూడగానే ప్రక్కనే వెడుతున్న ఆటోని ఆపి అతన్ని ఎక్కించి 'హాస్పిటల్‌కు పోనీ' అంటూ ఎక్కాడు. ఆటో వేగంగా వెళ్ళిపోయింది.

క్షణాల్లో జరిగిపోయిన సంఘటనకి నివ్వెరపోయింది వినీల. ఎవరంతకు వారు పట్టనట్టు మెల్లిగా తప్పుకున్నా మహంత్ చూపిన చొరవ, ధైర్యాన్ని మనసులో మెచ్చుకోలేకపోయిందా నాడు.

"ఏమిటే ఇంకా పడుకోలేదా?" అన్న తల్లి మాటలకి బెడ్‌లైట్ స్విచాప్ చేసి మహంత్ గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది.

బస్ షెల్టర్ వద్ద నిల్చుని వుందామె. ఉదయ భానుని లేలేత కిరణాలు షెల్టర్‌కున్న రంధ్రాల నుండి ప్రసరించి ఆమె శరీరాన్ని తాకి తళుక్కున మెరిపిస్తున్నాయి.

ఆమె ఛాయ క్రీమ్ కలర్ – ఆమె వంటి నంటుకున్నందువల్లనేమో అందాన్ని, ఆకర్షణని రెట్టింపుగా తెచ్చి పెట్టుకుంది అన్నట్లుగా పికాక్ శిల్క్ శారీ మేచింగ్ బ్లౌజ్.

అక్కడ అందరి చూపులు వినీలపై ఆర్తిగా.

ఎన్నో దృశ్యాలు అదృశ్యమై, అస్పష్టంగా కనిపించే కళ్ళజోడు మాటున తొంగిచూస్తున్నాయి అక్కడో వృద్ధాప్యపు చూపులు! పారిజాత మందు అప్సరస నిలబడినా .– ఆ పాత షెల్టర్ నందు నిల్చున్న ఆమె ముందు దిగదుడుపే... అన్నట్లుగా యువకుల చూపులు వినీలపై ప్రసరిస్తున్నాయి. కానీ ఆమె చూపులు మాత్రం ఎవరి కోసమో వెదుకుతున్నట్లుగా వున్నాయి.

అప్పుడే అక్కడికొచ్చిన మహంత్‌ని చూడగానే ఆమె కళ్ళలో మెరుపు – మనసులో తెలియని స్పందన – అవుడనుకుంది 'ఇదేనేమో ప్రేమకున్న శక్తి' అని.

రోజులు దొర్లిపోతున్నాయి. కానీ అతను మాత్రం ప్రవరాఖ్యునిలా, వరూధినిలా ఆమె! అతను కన్నెత్తి చూడక పోవడం బాధ కలిగించింది.

పరధ్యానంగా బస్సు ఎక్కుతోంది వినీల. వెనుకగా మహంత్.

ఆ క్షణంలో 'దబ్' మని శబ్దం అయింది. బస్సులోని వారంతా అటు చూశారు. ఆ దృశ్యం అక్కడి వారికి అసూయని రేకెత్తించింది.

నొడిసి పట్టుకున్నాడామెను. క్షణం పాటు తేరుకోలేకపోయింది.

"థాంక్సండీ! సారీ కాలు స్లిప్ అయింది. మీకేమైనా దెబ్బ తగిలిందా" అంది రేకుకు తగులుకుని చిరిగిపోయిన చొక్కాని చూస్తూ.

"పర్వాలేదులెండి! ఆ మాత్రం తట్టుకోలేకపోతే ఎలా" అన్నాడు ఆమెనే చూస్తూ.

'జారిపడడం పుణ్యమా!' మహంత్ దగ్గరయ్యాడు. వినీలకి సంతోషంగా వుంది.


ఆహ్వానించిందోనాడు మహంత్‌ని.

లోనికి వచ్చిన మహంత్‌కి విశాలమైన బెడ్ మీద అందాల్ని బహిర్గతం చేస్తున్న వినీలని చూడగానే గుండె వేగం రెట్టింపయింది. మెల్లిగా కదిలాడు.

తొలిగిన వస్త్రాన్ని ఆమె మీద కప్పుతున్నంతలో కళ్ళు తెరిచిన ఆమె చటుక్కున మీదికి లాక్కుంది.

"ప్లీజ్ వినీలా! ఇలాంటివి పెళ్ళికి తర్వాతే" అంటూ సున్నితంగా తిరస్కరించి నుదిటి మీద చిరు ముద్దిచ్చి – 'అర్జంట్ వర్కుంటూ' వెళ్ళిపోయాడు.

అతడి విగ్రహానికి జోహార్లు అర్పిం



చింది మనసులో.

* * *

బీచికి దూరంగా... చల్లని సాయంత్రం. సముద్ర కెరటాల సవ్వడులు లీలగా వినిపిస్తున్నాయి. "చెప్పు వినీలా ఏదో చెప్పాలన్నావు" అడిగాడు మహంత్.

"మహంత్ అది... అది ఇంతకుముందు ఒకతనికి మనసిచ్చాను. ఆదిలోనే హంసపాదు అన్నట్టు మా ప్రేమ మొగ్గ దశలోనే వాడిపోయింది" అతన్నే చూస్తూ చెప్పింది వినీల పరీక్ష పెడుతున్నానన్న భావం కానరాకుండా.

అతడి ముఖంలో రంగులు మారాయి క్షణం పాటు.

"చూడు వినీలా! నీ గతం నాకనవసరం. భవిష్యత్తులో కూడా గతాన్ని గతంలాగే వుంచుతా. బహిర్గతం చేయను" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

అతని సహృదయానికి కరిగిపోయి అడ్డు చెప్పలేకపోయింది. ఆహ్లాద వాతావరణంలో ఆక్రమించుకోబోతున్నంతలో ఎవరివో అడుగుల శబ్దం రావడంతో సర్దుకున్నారు.

వారిని గమనించని మరో ప్రేమ జంట వారి ముందున్న పొద దగ్గర ఆసీనులు కావడంతో వినీలా మహంత్ అక్కడి నుండి నిష్క్రమించక తప్పలేదు.

పై బ్రాంచికి ప్రమోషన్ మీద ట్రాన్స్ఫర్ వచ్చింది. మూణ్ణెల్ల తర్వాత వచ్చి పెళ్ళి చేసుకుంటానని వెళ్ళిపోయాడు మహంత్.

* * *

మామయ్య నుండి పిలుపు రావడంతో వెళ్ళింది వినీల.

"అమ్మా వినీలా! జ్యోత్స్నను చూడ్డానికి ఇవాళ వస్తున్నారట. పేరయ్య చెప్పాడు. నీ అమ్మా నాన్నలు కూడా వచ్చి వుంటే బావుండేది" అన్నాడు మేనమామ రాఘవయ్య.

"వాళ్ళెప్పుడూ బిజీ బిజీ! నేనున్నాగా ఇట్టే రెడీ చేస్తా"నంటూ డ్రెస్సింగ్ రూంలోకి వెళ్ళిపోయింది వినీల.

వచ్చిన వారితో మాట్లాడుతున్నాడు రాఘవయ్య.

జ్యోత్స్నతో "నీవు చూడబోయే వాడు – నిన్ను చూడబోయేవాడెలా వున్నాడో చూస్తా" నంటూ కిటికీలోంచి చూసింది.

ఆ క్షణమే – ఊచల్ని పట్టుకున్న ఆమె చేతులు బిగుసుకున్నాయి. అప్రయత్నంగా విసురుగా వెళ్ళింది హాల్లోకి.

వినీలని చూడగానే నిశ్చేష్టుడయ్యాడు.

ఒక్కసారిగా తేరుకుని "అది కాదు వినీలా" అంటూ చెప్పబోతున్న మహంత్ మాటలకి అడ్డు వస్తూ "ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవాలనుకోకు మిస్టర్. ఇప్పుడు తెలిసింది నీ స్వార్థమేమిటో. ఆ రోజు... 'పెళ్ళి తర్వాతే ఇవన్నీ' అంటూ నాలో స్థానం సంపాదించుకున్నావు. నేను ఇంకొకరికి మనసిచ్చాననగానే లేని సహృదయాన్ని చూపి నన్ను లోబర్చుకోవాలని చూశావని ఇప్పుడర్థమవుతోంది. ఆరోజు బీచ్‌లో అటు ఎవరో రావడంతో సరిపోయింది గానీ లేకుంటే... ఛీఛీ ఇంతసేపు నీతో మాట్లాడడమే వేస్ట్. మర్యాదగా ఇక్కడ్నించి వెళ్ళిపో" అంది. ఆవేశాన్ని అణచుకోలేకపోతోంది.

పెళ్ళి తర్వాత కూడా ప్రేమించవచ్చు. మనసులు కలవవచ్చు. ఆ ప్రేమను జీవితాంతం నిలుపుకునేట్లు చేసుకోగలగాలి. పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె మనసు కుదుటపడింది.

కానీ మహంత్ తన ఫిజిక్‌తో ఆకరించి అందిన వాటిని అనుభవించేవాడని – అందరిలాంటిది కాని వినీల విషయంలో ద్రౌపది మోహించిన కీచకునిలా వెంటపడితే అందదని తెలుసుకున్న అతడు ప్రవరాఖ్యునిలా, జెంటిల్‌మెన్‌లా ప్రవర్తించాడని తెలిస్తే ఆమెకి 'ప్రేమ' మీద పూర్తిగా విరక్తి చెంది వుండేది.